# కాలసూత్రం

రోజులు సాఫీగా సాగుతున్న కాలం అది. మూడు పూటలూ తిండికి వెదుక్కోని మారుమూల గ్రామం అది.

అప్పుడు ఆ గ్రామం చెట్లూ, పుట్టలూ, పొదలూ, డొంకలతో చిన్న అడవి మధ్య ఉన్నట్టుండేది. అయినా, ఆ గ్రామంలో పంటలు పండే పొలాలున్నాయి. జనాభా తక్కువ, పూరి గుడిసెలు ఎక్కువ. ఎటుచూసినా పచ్చదనమే. అక్కడ ఆకలి వుండొచ్చుగానీ ఆకలి చిచ్చు వున్న జాడలేవు.

ఆ గ్రామంలో పంచాయతీ బోర్డు లేదు. అంచేత ఎన్నికలు లేవు. అంచేతే కాబోలు కొట్లాటలూ, తగాదాలూ లేవు. అక్కడ భూస్వాములున్నారు. సన్నకారు రైతులున్నారు. కష్టించే కూలీలున్నారు. తోటివాళ్ళకు సహాయపడే గుణంతో పాటు మంచి దగ్గర చెడ్డ వస్తే మట్టుపెట్టే గుణమూ వుంది వాళ్ళకు.

చెట్లూ, పుట్టలూ, పొదలూ, డొంకలూ ఎక్కువగా వుండడంవల్ల ఆ వూళ్ళో పాములు ఎక్కువగా వుండేవి. పాములున్నంతగా పాముల వాళ్ళు లేరు ఆ వూళ్ళో. పాముల వాళ్ళు లేని లోటును పాముల సింహాద్రి తీర్చేవాడు.

పాముల సింహాద్రి ప్రతి సూర్యగ్రహణం రోజునా ఆ వూరి పక్కనే వున్న పెద్ద కాలువలో మునిగి, తర్వాత నీళ్ళల్లో నిలబడి తూర్పుకు తిరిగి నిష్ఠగా మంత్రాలు జపించేవాడు. ఆ రోజున జపించే మంత్రాలకు బలమెక్కువని అతను నమ్మేవాడు. గ్రహణం విడిచిన తర్వాత విడుపుస్నానం చేసి ఇంటికి వచ్చేవాడు. తల శుభ్రంగా తుడుచుకుని, గిరజాల జుట్టును వెనక్కు దులుపుకుని ముడి వేసుకునే వాడు. అద్దం ముందు కూర్చుని తిరుచూర్ణం బొట్టు ముఖాన పెట్టుకునేవాడు.

సింహాద్రి ఆజానుబాహువు. ఒంటిమీద పంచె తప్ప ఇంకేమీ వుండేది కాదు. పైవూరు వెళ్ళేటప్పుడు మాత్రం చొక్కా వేసుకునేవాడు. తలకు పెద్ద పాగా చుట్టుకునేవాడు. సింహాద్రి పాము మంత్రం వేస్తే పాముకాటు తిన్న వ్యక్తి తప్పకుండా బతుకుతాడని ఆ వూరి వాళ్ళకూ, చుట్టుపక్కల వూళ్ళ వాళ్ళకూ గొప్ప నమ్మకం.

అందుకే అతనంటే ఎంతో గౌరవం. సింహాద్రి ఒక్క కాణీ కూడా తీసుకోకుండా మంత్రంవేసి, వనమూలికల రసాన్ని పట్టించి, ప్రాణం పోస్తాడని అందరూ అతన్ని దేవుడిలా చూసేవారు.

సింహాద్రికి ఆరెకరాల పొలం వుంది. ఒక కొడుకూ, నలుగురు కూతుళ్ళూ వున్నారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసేసి, సారే, చీరా పెట్టి, రాకాపోకా జరిపి, పురుళ్ళూ, పుణ్యాలూ జరపడంతో అతను కొంత అప్పుల పాలయ్యాడు. తలమునకలుగా అప్పుల్లో వున్నప్పుడయినా సింహాద్రి తనవికాని తవ్వెడు గింజలు ముట్టేవాడు కాడు. అన్నం తింటున్నా, నిద్రపోతున్నా, 'గది'లో వున్నా 'బాబూ, సింహాద్రి బాబూ' అన్న కేక వినిపిస్తే చాలు ఎలా వున్నవాడు అలా వచ్చేసేవాడు.

ఒకనాడు కంచం ముందు కూర్చుని సింహాద్రి అన్నం కలపబోతున్నాడు. బయట నుంచి 'సింహాద్రి బాబూ' అన్న కేక వినిపించింది. లేవబోతుంటే భార్య అడ్డుకుంది.

''నిన్నల్లా ఉపవాసం. చెయ్యి కడిగితే మళ్ళా అన్నం ముట్టవు. తినేసి వెళ్ళు'' అందామె.

''రెండ్రోజులు అన్నం తినకపోతే నేను చావను. రెండు నిటాలు ఆలస్యమైతే ఆ జీవుడు హరీమంటాడు'' అంటూ సింహాద్రి చెయ్యి కడిగేసుకుని వెళ్ళేసరికి ఇంటి ఎత్తరుగల నిండా జనం. ఎడమవైపు ఎత్తరుగు మీద కొండమ్మను పడుకోబెట్టారు. కొండమ్మ కుడికాలి బొటనవేలుమీద పాము ముట్టింది. అతని నోటంట నురగ వస్తోంది. సింహాద్రి, జనాన్ని దూరంగా జరగమని చెప్పి, కొడుకు తాతాలును పిలిచాడు.

తాతాలు పరుగు పరుగున వేపమండలు తెచ్చి, తండ్రి కిచ్చాడు. తర్వాత, ఆదరాబాదరా లోపలికెళ్ళి, కల్వంలో వనమూలికలు వేసి నూరసాగాడు.

సింహాద్రి కళ్ళు మూసుకుని, మంత్రం వేస్తూ, కొండమ్మ కుడికాలి బొటన వేలిమీద వేప మండలు విసురుతున్నాడు.

కొండమ్మ భార్య వణికిపోతూ, ఏడుస్తూ సింహాద్రికి మాటి మాటికి దణ్ణం పెడుతోంది.

''బయం నేదు సాయిత్రీ, సివాద్రిబాబు మంతరం యేత్తన్నాడు గందా. కొండమ్మ లేచి తిరుగుతాడు. సివాద్రిబాబు మంతరానికి తిరుగునేదు'' అని కొండమ్మ భార్యకు

కొందరు ధైర్యం చెబుతున్నారు.

అలా ధైర్యం చెబుతున్నవాళ్ళ ఎరికలో ఒకే ఒక్కసారి సింహాద్రి మంత్రం పని చెయ్యలేదు.

సూరడని ఆ వూరిలో ఓ మొండివాడు వుండేవాడు. వాడెంత మొండివాడో అంత కోపిష్టి కూడా. ఓ వెన్నెల రాత్రి సూరడు లొల్లాయి పదాలు పాడుకుంటూ పొలంనుంచి వస్తుంటే తాచుపాము కాటేసింది. వెంటనే సూరడు దాని తోక పట్టుకుని, నేలకేసి కొట్టి చంపేయబోయాడు. అదేమో వాడికంటే కోపిష్టి ముండ. సూరడి చెయ్యిని చుట్టేసి, టపటపా అయిదారు కాట్లేసింది. దాంతో సూరడు రెచ్చిపోయి దాని పడగని రెండో చేత్తో పట్టుకుని, నేలమీదేసి, కాలితో తొక్కి, కర్రతో చితకబాది చంపేసి, అప్పుడు వచ్చాడు సింహాద్రి దగ్గరకు. సింహాద్రి మంత్రం వేయడం మొదలెట్టేటప్పటికే సూరడి ఒంటినిండా విషం ఎక్కేసింది...

కొండమ్మ నోరు బలవంతంగా తెరిచి, వనమూలికల రసాన్ని పోశాడు సింహాద్రి. కొండమ్మ గుటకేశాడు. సింహాద్రి ఊపిరి పీల్చుకున్నాడు.

"ఇంక ఫర్లేదు" అన్నాడు సింహాద్రి కొండమ్మ భార్యకేసి చూసి.

కొండమ్మ భార్య సింహాద్రికి ఎన్ని దణ్ణాలు పెట్టిందో!

"నువ్వూ, నీ కుటుంబవూ ఎయ్యేళ్ళు సల్లగుండాల" అని ఆమెలా ఎంతమంది సింహాద్రి కుటుంబాన్ని దీవించారో!

అయినా ఏ ఒక్కరి దీవెనా ఫలించినట్టులేదు.

☆ ☆ ☆

ఆ వూరికి మట్టిరోడ్లు పోయి, కంకర రోడ్లు వచ్చాయి. తెల్లదొరల పాలనపోయి, దేశానికి ఏదో స్వరాజ్యం వచ్చిందని అంతా అనుకున్నారు.

ఆ గ్రామం జనాభా పెరిగింది. పెరిగిన జనాభా కోసం సాగుభూమిని కూడా పెంచవలసి వచ్చింది. ఊరు చుట్టూ ఉండే చెట్లూ, చేమలూ, పుట్టలూ, పొదలూ చాలావరకూ నరికేశారు. తొలగించేశారు. ఇప్పుడావూరు దాదాపు బట్టబయల్లో వున్నట్టుంది.

సింహాద్రి ఇప్పుడు పూర్వంలా నడవలేక పోతున్నాడు. వయసు పైబడింది. సింహాద్రి భార్య జబ్బుపడి చనిపోయింది. చేసిన అప్పులకు వున్న కాస్త కొంచ్రా లేకుండా పోయింది. ఇల్లు మాత్రం మిగిలింది.

తాతాలుకు నేర్పిన పాము మంత్రాలే సింహాద్రి కుటుంబానికి జీవనాధార మయ్యాయి. మంత్రం వేసినందుకు తాతాలు డబ్బులు తీసుకోవడం మొదలు పెట్టాడు. అలా డబ్బులు తీసుకోవడం సింహాద్రికి ఇష్టం లేకపోయినా, ఏం చేయలేక వూరకుండి పోయాడు. కక్కుర్తి పడ్డా కడుపు నిండదురా అన్నా, తాతాలు వినిపించుకోలేదు.

మైనేరు రాజుగారింట్లో ఓ రోజున గోధుమ తాచు కనిపించింది. వాళ్ళింట్లోని పెద్దలూ, పిన్నలూ తెగ భయపడిపోయి, తాతాలుకు కబురు పంపారు. తాతాలు "ఎందుకో" అనుకుంటూ వెళ్ళాడు.

"తాతాలూ, చాలా పెద్ద పామురా, వంట గదిలోకి పోయింది. అంతా హడలి చస్తున్నాం. దాన్ని నువ్వు ఎలాగైనా పట్టుకోవాలిరా, మా కుల దైవం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి. అంచేత ఆ పామును చంపకుండా పట్టుకో."

"మంత్రా లెయ్యడమేకానీ, పాముల్ని పట్టుకోవడం నాకు చేతకాదు బాబూ!"

"అలాగంటే ఎలాగోయ్, నీ కష్టం వుంచుకోనులే. అయిదు రూపాయ లిస్తాను."

ఆ మాటతో తాతాలు మెత్తబడ్డాడు. అయిదు రూపాయలతో రెండు రోజులపాటు ఇంటిల్లిపాదీ భోజనం చేయవచ్చు. తాతాలు మొండిగా వంటింట్లో కెళ్ళాడు. చేతికి గోనె సంచి చుట్టుకున్నాడు. తాతాలుకు లోపల్లోపల భయంగానే వుంది. అయినా, పామును పట్టుకుంటే అయిదు రూపాయలొస్తాయి, ఐదు... తాతాలు చొరవగా పామును పట్టేసుకున్నాడు.

అప్పటినుంచీ తాతాలు మంత్రాలెయ్యడమే కాకుండా పాముల్ని పట్టుకోవడం కూడా మొదలెట్టాడు. అయినా, తిండికి తిప్పలు పడవలసిన పరిస్థితి తప్పడంలేదు.

☆ ☆ ☆

ఇప్పుడా గ్రామం పూర్తిగా మారిపోయింది. చెట్లూ, పుట్టలూ, పొదలూ బాగా తగ్గిపోవడంతో పాములూ తగ్గాయి. పాము కాట్లూ తగ్గాయి. తవ్వేసిన గరువులూ, నరికేసిన చెట్లూ, చేమల ప్రదేశాలు సాగుకు లాయికీ అయ్యాక భూస్వాముల పరమయ్యాయి. పంచాయతీ బోర్డు వచ్చింది. పంచాయతీ బోర్డులోనే కాకుండా కొంతమంది ఇళ్ళల్లో కూడా రేడియోలు పలుకుతున్నాయి. వీధుల్లోనూ, ఇళ్ళల్లోనూ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

తాతాలుకు కొడుకు, ఇద్దరు కూతుళ్ళు. కొడుక్కి తండ్రి పేరే పెట్టాడు. మూడో కాన్పులో ప్రసూతి వాతానికి గురై తాతాలు భార్య రోగిష్టిది అయిపోయింది.

సింహాద్రికి వున్న నాలుగు పళ్ళూ ఊడిపోయాయి. కళ్ళు సరిగ్గా ఆనడం లేదు. వినికిడి శక్తి మాత్రం ఏమీ తగ్గలేదు.

కుటుంబ భారం అంతా తనపైనే పడడంతో తాతాలుకు అకాల వార్ధక్యం వచ్చేసింది. తండ్రి, భార్యా బిడ్డల పోషణకోసం, రోగాలకు వైద్యం చేయించడం కోసం ఇంటిమీద అప్పు తేవడమూ, ఖర్చయిపోవడమూ జరిగిపోయింది.

బతుకును తలుచుకున్న కొద్దీ తాతాలుకు భయమేస్తోంది. ఇంతమందినీ ఎలా పోషించాలో తెలీక మతిపోతోంది. ఎప్పుడోకానీ పాము కాట్లు పడ్డవాళ్ళు రావడంలేదు.

అంతకు ముందు రోజు నుంచీ తాతాలు ఇంట్లో ఎవరూ తిండి తినలేదు. తాతాలు సావిడి గుమ్మం మీద కూర్చుని వీధిలోకి చూస్తున్నాడు. విసుగ్గానే కాకుండా ఆత్రుతగా కూడా చూస్తున్నాడు. ఇంతలో మున్సబుగారి నౌకరు కంగారుగా వచ్చాడు.

"మున్సబుగోరు నిన్ను గమ్మున రమ్మన్నారు" అన్నాడతను ఒగురుస్తూ.

"ఏటికత, నాతో ఏమవసరం వచ్చింది."

"ఆరింట్లోకి పాము వచ్చింది. ధాన్యం పురిలోకి దూరిపోయింది."

"అలాగా? నడు. నేనిప్పుడే వస్తున్నాను"

తాతాలు సంతోషంగా బయలు దేరాడు.

మున్సబుగారింట్లో పొడవాటి తాచుపామును సునాయాసంగా పట్టుకున్నాడు. మున్సబు యిచ్చిన డబ్బు తీసుకుని, ఆ రోజుకు ఇంటికి సరిపడే వెచ్చాలు కొన్నాడు తాతాలు.

మర్నాడు సావిడి అరుగుమీద కూర్చుని కూనిరాగం తీస్తూ వీధిలోకి చూస్తున్నాడు తాతాలు. అంతలో బతుకు వీపు తట్టడంతో కూనిరాగం ఆగిపోయింది. మనసు బరువైపోయింది. ఎన్నాళ్ళీ బతుకు? ఇల్లు పెదకాపు దగ్గర తనఖాలో వుంది. వడ్డీ తెగ పెరిగిపోతోంది. తీసుకున్న డబ్బు, వడ్డీ కలిసి ఇంటి ఖరీదుకు మించిపోయింది. అప్పుతీర్చే దారిలేదు. రేపో మాపో అప్పిచ్చిన పెదకాపు ఇల్లు ఖాళీ చేయమని అనడం ఖాయం. ఇప్పటిదాకా కడుపుకి లేకపోయినా తలదాచుకోడానికో ఇల్లయినా వుంది. ఇదిపోతే ఎలా బతకాలి?

తాతాలు ఆలోచిస్తున్నాడు. అతని చూపు మాత్రం వీధిమీదే వుంది. దూరంగా

పెదకాపుగారి మనిషి హడావుడిగా వస్తుండడాన్ని చూశాడు తాతాలు. అతను దగ్గరికి వచ్చేక, ఏవిటన్నట్టు చూశాడు తాతాలు.

"పెదకాపు గారి పిడకల కొట్టంలోకి పాము వెళ్ళింది. దాన్ని పట్టుకోవాలి. బేగి రా" అని అతను వచ్చినంత హడావుడిగానూ వెనుదిరిగాడు.

తాతాలు వెళ్ళేటప్పటికి పెదకాపు ఇంట్లోని జనం భయం భయంగా ఇంటి చూరు దగ్గిర నిలబడి వున్నారు. పెదకాపు చుట్ట కాలుస్తూ పిడకల కొట్టం వంక చూస్తూ దూరంగా నిలుచున్నాడు.

"ఇన్ని పిడకల్లో పాము ఎక్కడుందో? పిడకలన్నీ తియ్యాలంటే చాలా కష్టం. ముందు కఱ్ఱతో పిడకల మధ్య ఖాళీలో పొడిచి చూద్దాం" అనుకుని తాతాలు కఱ్ఱపట్టుకుని ముందుకెళ్ళాడు.

ఒక చేతికి గోనె సంచి చుట్టుకుని, రెండో చేత పట్టుకున్న కఱ్ఱతో తాతాలు పిడకల మధ్య ఖాళీలో పొడవడం మొదలు పెట్టాడు.

ఓ అరగంటకు పాము బుసకొడుతూ సఱ్ఱున బయటికొచ్చింది. జనం "అమ్మో, అయ్ బాబోయ్" అంటూ వెనక్కు పరుగెత్తారు. తాతాలు గబుక్కున గోనె సంచి చుట్టుకున్న చేత్తో, పామును పట్టుకున్నాడు. కఱ్ఱ అవసరం రాలేదు. పెదకాపు, అతని కుటుంబ సభ్యులూ "హమ్మయ్య" అనుకున్నారు.

తాతాలును బయట వుండమని చెప్పి, పెదకాపు తన గదిలోకి వెళ్ళాడు. తాతాలుకు డబ్బివ్వడమా, మానడమా అన్న ఆలోచనలో పడ్డాడు. తాతాలు తన దగ్గర అప్పు తీసుకున్న మనిషాయె! ఆలోచన ఎంతకీ తెగడంలేదు.

చేతిలో పాముతో తాతాలు పెదకాపు ఇంటిముందు, వీధిలో నిలబడ్డాడు. డబ్బులు కోసం ఎదురు చూస్తున్నాడు. వీధిన పోతున్న జనం తాతాలు చేతిలోని పామును చూసి ఆగుతున్నారు. అబ్బో, ఎంత పెద్ద పామో అని కొందరు ఆశ్చర్య పోతున్నారు.

పెదకాపు ఇంటివైపుగా వస్తూ... మూగిన జనాన్ని చూసి, మున్సబు ఆగాడు. తాతాలు చేతిలోని పామును చూశాడు. మళ్ళీ జాగ్రత్తగా కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

"ఏరా తాతిగా, అది నిన్న మా ఇంట్లో పట్టిచ్చిన పామేకదూ, ఇవేళ మళ్ళీ వీళ్ళింట్లోకి ఎలా వచ్చింది? నిజం చెప్పు. మా ఇంట్లో పట్టిన పామును పెదకాపు ఇంట్లో వదిలావు. అవునా? నిన్నే, మాట్లాడవేం బెల్లం కొట్టిన రాయిలాగ. అసలు

నిన్నయినా ఈ పాము మా ఇంట్లోకొచ్చిందా? లేకపోతే నిన్నా నువ్వే వదిలావా?" అన్నాడు మున్సబు గొంతు పెంచి గదమాయిస్తూ.

తాతాలు ముఖం వెలవెలబోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. గొంతు తడారిపోయింది. బెదిరిపోయాడు. వణికిపోయాడు.

"అయ్యా! నేను చేసింది తప్పేనండి. పొట్ట నింపుకోడానికి వేరే గతిలేక ఇలా చేశానండి. మా తాతల నాటి నుంచి పాము మంత్రాలు వేసి మేం బతకడం మీకు తెలుసుకదా బాబయ్యా! ఇప్పుడేటో పాములు తగ్గిపోయాయి. పాము కాట్లు తగ్గిపోయాయి. దాంతో ఒక్క పైసా రావడంలేదు. నా కుటుంబాన్ని ఆకలితో మాడ్చలేక ఇలా చేశాను. ఈ ఒక్క తప్పూ కాయండి, ఇంకెప్పుడూ ఇలాటి పన్లు చేయను. ఏదైనా పనిప్పించండి అయ్యల్లారా" తాతాలు ఈ మాటలు అందామనుకున్నాడు కాని, నోరు పెగల్లేదు.

తాతాలు మౌనం అక్కడున్నవాళ్ళకు మరీ కోపం తెప్పించింది. అతన్ని చూసి ఎవరికీ జాలి కలగలేదు.

"ఇలాంటి బతుకు బతికేదానికన్నా సావటం నయం. ఇదేం బతుకురా మోసం బతుకు".

" సివాద్రిబాబు కడుపున సెడబుట్టావురా దొంగ వెధవా. ఆయన ఎంత నీతిగా, ఎంత గవురవంగా బతికేడు. ఆయన బతికుండగానే ఆయన పరువు తీసే కొడుకు బయల్దేరాడు.'

"అమ్మ నా కొడక! నువ్వొదిలేసిన పాము ఇంట్లో ఎవరినన్నా కాటేస్తే, అళ్ళేమవుతారు? పేణాలతో సెలగాట మాడతావురా యదవనాయాలా."

జనం తలో రకంగా తిట్టారు.

"ఒరేయ్. నువ్వీ వూళ్ళో వుంటే ఇంకా ఎన్ని మోసాలు చేస్తావో. వెంటనే ఈ వూరొదిలిపో. ఎలాగూ నీ యిల్లు పెదకాపు తనకాలో వుంది. నువ్వెలాగూ ఆ అప్పు తీర్చలేవు. రేపు తెల్లారేటప్పటికి ఈ పొలిమేరల్లో కన్పించకూడదు. నీ తండ్రి మొగం చూసి నిన్ను వదిలేస్తున్నాం, లేకపోతే నీ సంగతేటో ఇప్పటికిప్పుడే చూసేద్దుం. ఏటంటావు పెదకాపూ" అన్నాడు మున్సబు.

పెదకాపు ఏటంటాడు? తన పని ఇంకొకరు చేస్తుంటే వద్దంటాడా?

తెల్లారేసరికి కాదు గాని, ఆ మర్నాడు తప్పించి,. మూడోనాడు తాతాలు తన

కుటుంబంతో ఆ వూరొదిలేశాడు.

☆ ☆ ☆

తాత తండ్రుల కాలం నుంచీ కడుపులో చల్ల కదలకుండా తను గడిపిన కాలం ఓ కలలా వుంది సింహాద్రికి. ఇప్పుడు తమ బతుకులు మజిలీ బతుకులై పోయాయి.

ఇలాంటి బతుకు బతకడమెందుకు? బతక్క చేసేదేముంది? ఆయుష్షు వున్నంతకాలం మనిషి బతక్క తప్పదు. కర్మ పరిపక్వం కానిదే మనిషికి విముక్తి లేదు. ఏదీ మనిషి చేతిలో లేదు. ఓ వూరి చివరి - సత్రంలో గోడకు చేరబడి పెద్దలు చెప్పిన సూక్తులు మననం చేసుకుంటున్నాడు సింహాద్రి.

తాతాలు, అతని భార్యా, ఇద్దరు కూతుళ్ళూ, బుల్లి సింహాద్రి పాముల బుట్టల్ని నెత్తిమీద పెట్టుకుని నాగస్వరం బూరా ఊదుతూ ఇంటింటికీ తిరిగి అడుక్కుంటున్నారు. వాళ్ళ బుట్టల్లోనివి కోరలు పీకేసిన పాములు.

తాతాలూ, ఇద్దరు కూతుళ్ళూ ఒక జట్టుగా, బుల్లి సింహాద్రీ, అతని తల్లీ ఒక జట్టుగా వీధి వీధికీ వెళ్ళేవారు. బుట్టమీది మూత తీయడం, బూర వూదుతూ బుట్టను కదపడం, పాము పడగెత్తి కదలడం- కాసేపు జనానికి వినోదం కలిగించి, వాళ్ళిచ్చింది పుచ్చుకోవడం, వచ్చిన దాంతో ఆకలి తీర్చుకోవడం, పాముల భయంలేకుండా వుంటుందని చెప్పి వనమూలికల్ని పావలా, అర్ధకీ అమ్మడం... ఒక్కో వూళ్ళో నాలుగైదు రోజుల మకాం. తర్వాత మరో ఊరు...

కొన్నాళ్ళకు పాములాట కూడా జనానికి 'థ్రిల్' కలిగించడం లేదు. తాతాలు కుటుంబ పరిస్థితి మరీ దుర్భరమై పోయింది. ఒక పూట తిండికే కనాకష్టమై పోతోంది. పల్లే, పట్నమూ కాని ఊరిలో తాతాలు కుటుంబం రెండు రోజులుగా తిరిగి తిరిగి వట్టి చేతులతో సత్రం దగ్గరికి తిరిగొచ్చింది.

తన కుటుంబం ఆకలి తీర్చలేకపోయినందుకు తాతాలు బాధపడిపోయాడు. అతనికి తిక్క తిక్కగా వుంది. బతుకుమీద విరక్తి పెరిగిపోయింది.

సత్రంలో దిగులుగా కూర్చున్న తాతాలుకీ ఆకలే. అతని భార్యా బిడ్డలకీ ఆకలే. సింహాద్రికీ ఆకలే. వాళ్ళ పక్కనే ఉన్న బుట్టలోని పాములకీ ఆకలే. ఆకలి వాళ్ళందర్నీ అవురావురుమని కాల్చేస్తోంది.

వాళ్ళకు బతుకులమీద అసహ్యం. తోటి మనుషుల మీద అసహ్యం. తమ పుట్టుకల మీద అసహ్యం.

బుల్లి సింహాద్రిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని, గోడకు జేరబడి కళ్ళు మూసుకున్న సింహాద్రి మాత్రం ఎవర్నీ అసహ్యించుకోవడంలేదు. ఉపవాసాలు అలవాటు కావడంవల్ల కావచ్చు, తరతరాల వేదాంతం మత్తులో తల దాచుకోవడంవల్ల కావచ్చు.

ఆకలి, నీరసంతో కునికిపాట్లు పడుతున్న బుల్లి సింహాద్రి తల నిమురుతూ 'కలికాలం' అనుకున్నాడు సింహాద్రి. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తాతాలు ఆ రోజంతా ఆలోచించాడు. ఎట్టకేలకు అతని ఆలోచన తెగింది. మెత్తగా అడిగితే ఒక్కడూ ఒక్క పైసా రాల్చడని నిశ్చయించుకున్నాడు. ఓ నిశ్చయానికి వచ్చేక, తాతాలు నిద్రలోకి జారిపోయాడు.

బాగా ఎండెక్కిన తర్వాత లేచాడు తాతాలు. నిద్ర లేచేటప్పటికి మళ్ళీ కడుపు కణకణలాడింది. దిగులుగా, నీరసంగా కూర్చున్న భార్యా బిడ్డల్ని చూశాడు. వాళ్ళను పిలిచాడు. వాళ్ళు లేచి, నెత్తిన బుట్టలు పెట్టుకోబోతుంటే.

"బుట్టలొద్దు, పాముల్ని చేత్తో పట్టుకుని నాతో రండి" అని, తనో పొడవాటి పామును చేత్తో పట్టుకుని వూరివైపు నడిచాడు.

అతనివెంట అతని కుటుంబమూ అలాగే నడిచింది. ఊరిలో కెళ్ళాక తామేం చెయ్యాలో తాతాలు వివరించాడు.

వాళ్ళు ఆ వూరి నడిరోడ్డుమీదకు వచ్చారు. వీధికి అటూ ఇటూ దుకాణాలు. తినుబండారాల వాసనలతో హోటళ్ళు. రకరకాల వస్తువులతో విద్యుద్దీపాల కాంతిలో మెరిసిపోతూ షాపులు.

తాతాలు, అతని భార్యా బిడ్డల చేతుల్లో పాములు, నల్లగా నిగనిగలాడుతూ పాములు. గోధుమరంగులో మెరుస్తూ, బంగారంతో చేసినట్టు పాములు...

ఒక్కసారిగా పర్వతాలు పేలినట్టు, భూకంపం వచ్చినట్టు చప్పుడు... వాళ్ళు అరుస్తున్నారు. కేకలు పెడుతున్నారు. పొలికేకలు. పిచ్చిపిచ్చిగా, వెర్రి వెర్రిగా, తిక్క తిక్కగా ఎగురుతున్నారు.

కసిగా కసికసిగా కసకసా పాముల్ని కొరుకుతున్నారు. రక్తాన్ని మనుషుల ముందు వూసేస్తూ, విషపు కళ్ళతో చూస్తూ "బాబూ ఆకలి, అమ్మా ఆకలి" అంటూ "యాహో యాహో" అని దీనంగా కాదు, భీకరంగా, వికృతంగా అరుస్తున్నారు.

ఆ బీభత్సాన్ని చూడలేక, భయంతో, జుగుప్సతో జేబులో ఏ నాణెం దొరికితే

ఆది, షాపుల గల్లా పెట్టెల్లో నుంచి చేతికొచ్చిన నాణెం, చిల్లర లేకపోతే చేతికందిన రూపాయినోటు పాములవాళ్ళ గిన్నెల్లోకి విసిరేస్తున్నారు.

"పొండిరా బాబూ, ఇక్కణ్ణుంచి వెళ్ళిపొండిరా, వెళ్ళిపొండి"

ఎంత త్వరగా వాళ్ళక్కడ నుంచి వెళ్ళిపోతే అంత బావుండుననుకుంటున్నారు జనం.

తాతాలు ఆనందానికి అవధుల్లేవు. చాలా రోజుల తర్వాత తాతాలు కుటుంబం తృప్తిగా భోంచేసింది.

మర్నాడు ఉదయం లేవగానే తాతాలుకు ఈ రోజెలా గడుస్తుందనే భయం కలగలేదు. ధైర్యంగా తన కుటుంబంతో వూళ్ళోకి బయల్దేరాడు.

చేత పాముల్ని పట్టుకుని జనాన్ని జడిపించి, డబ్బులు సంపాదించడానికి వెళ్తున్న తన కుటుంబం సింహాద్రికి మసకమసకగా కనిపించింది.

పాముల భయం లేకుండా ప్రజల్ని కాపాడిన తన కుటుంబం, పాముల్ని చూపి ప్రజల్ని భయపెట్టి బతకాల్సి వచ్చినందుకు సింహాద్రి విలవిలలాడిపోయాడు.

కొంతసేపటికి మనసును అదుపులో పెట్టుకుని, "యుగధర్మం మారినప్పుడు అందుకు అనుగుణంగా మనిషీ మారక గత్యంతరం లేదేమో" అనుకుంటూ నిట్టూర్చాడు సింహాద్రి.

*(12-18 జూన్ 1987 ఆంధ్రసచిత్ర వారపత్రిక)*

(రచనాకాలం 1975)